
సాక్షి అనంతపురం


గురువారం । 17 । అక్టోబర్ । 2024



వేసెయ్ పాగా

అనంతపురం రూరల్ మండలం కురుగుంట పొలం పరిధిలోని వంక పొరంబోకు భూమిపై టీడీపీ నాయకులు కన్నేశారు.

8లో



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.26, సరాసరి రూ.36 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై జిల్లా అంతటా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

గజ వాహనంపై శ్రీవారి వైభవం



గజవాహనంపై చింతల వెంకటరమణస్వామి

తాడిపత్రి అర్బన్: లక్ష్మీచింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు గజ వాహనంపై పుర వీధుల్లో విహరించారు. ఉదయం స్వామి వారు శ్రీదేవి,భూదేవి సమేతుడై వేణుగోపాలస్వామి అలంకరణలో పురవీధుల్లో ఊరేగారు. గజ వాహనంపై ఉన్న శ్రీవారిని వీక్షిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో స్వామి దర్శనానికి పోటెత్తారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య శ్రీవారి ఊరేగింపు సాగింది.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీచింతల వెంకటరమణస్వామి స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం ఉంటుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వర్షం కారణంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పందిళ్లు వేశారు. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్ జైలులో సౌకర్యాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

కళ్యాణదుర్గం: జైలులో ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ సూచించారు. పట్టణంలోని సబ్ జైలును బుధవారం ఆయన పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న భోజన నాణ్యత, మరుగుదొడ్లు, స్టోర్ రూంను తనిఖీ చేశారు. బ్యారెక్‌లలో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు నుంచి ఇంటికి వెళ్లాక మరోసారి తప్పులు చేయకుండా మంచిగా జీవించాలని సూచించారు.కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు టి.దాదాఖలందర్, రామాంజనేయులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. పీజీ ఎంట్రెన్స్–2024లో అర్హత సాధించి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అక్రమాలపై బిగుస్తున్న ఉచ్చు

- 'సమగ్ర'లో రీప్యాట్రేషన్ మార్గదర్శకాలు తుంగలో తొక్కిన అధికారులు
- కొత్త పోస్టుల భర్తీ అంశంలోనూ తప్పిదాలు
- ఆధారాలతో వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఓ ప్రజాప్రతినిధి
- విచారణకు ఆదేశించిన కలెక్టర్
- నేడో, రేపో నివేదిక



అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలు పాటించకుండా అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్న విద్యాశాఖ అధికారులపై ఉచ్చు బిగుస్తోంది. సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల రీప్యాట్రేషన్, కొత్తగా తీసుకునే వారి విషయంలో కమిషనర్ మార్గదర్శకాలను తుంగలో తొక్కుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేని విధంగా ఇక్కడి విద్యాశాఖ అధికారులు నిర్ణయాలు తీసుకున్నారు. చివరకు కలెక్టర్‌ను కూడా తప్పుదోవ పట్టించి ఫైళ్లపై సంతకాలు చేయించారు. ప్రతిదీ 'నాయనా...నా చేతుల్లో ఏమీ లేదు అంతా కలెక్టర్ నిర్ణయం' అంటూ జిల్లాధికారిపై తోసేసి తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. వీరి నిర్వాకంపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఓ ప్రజాప్రతినిధి స్వయంగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. వయోజన విద్య ఉప సంచాలకులు ఆంజనేయులును విచారణ అధికారిగా నియమించారు. సెక్టోరియల్ అధికారుల రీప్యాట్రేషన్, కొత్తగా తీసుకునే వారి విషయంలో కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయి? ఇక్కడి అధికారులు ఎలా వ్యవహరించారనే అంశంపై విచారణ అధికారి సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రశ్నావళి తయారు చేసి సమగ్ర శిక్ష డీపీసీ, ఏపీసీకి కూడా నోటీసులు జారీ చేశారు. వారి వివరణతో పాటు నిబంధనలు పరిశీలించి కలెక్టర్‌కు సమగ్ర నివేదికను అందజేయనున్నట్లు విచారణాధికారి ఆంజనేయులు తెలిపారు.

ఏదీ పారదర్శకత..?

సెక్టోరియల్ అధికారులను ఆగమేఘాలపై రిలీవ్ చేసి అంతే స్పీడుగా నోటిఫికేషన్ కూడా ఇచ్చేశారు. దరఖాస్తుల స్వీకరణ, స్క్రూటినీ, ఇంటర్వ్యూ అన్నీ గోప్యంగానే ఉంచారు. అనర్హులకు సంబంధించి రిమార్కులను పొందుపరచలేదు. వివరాలు నోటీస్‌బోర్డులో ప్రదర్శించలేదు. కనీసం ఆన్‌లైన్‌లోనూ ఉంచలేదు. అభ్యర్థులకు సమాచారం తెలియజేయలేదు. అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం ఇవ్వలేదు. గతంలో సమగ్ర శిక్ష, స్కూళ్లలో క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘించిన వారినీ జాబితాలో చేర్చారు. అదే సమయంలో అర్హులైన వారిని పక్కన పెట్టేశారు. ఇదంతా అత్యంత గోప్యంగానే చేశారు.

ముమ్మాటికీ ఉల్లంఘనే..!

వివరాలు పరిశీలిస్తే కమిషనర్ మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించారని ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. వేసవి సెలవుల్లో తప్ప పాఠశాల పనిదినాల్లో సెక్టోరియల్ అధికారులుగా పని చేస్తున్న టీచర్లను రిలీవ్ చేయకూడదు. కొత్తగా తీసుకునే వారిని కూడా వేసవి సెలవుల్లోనే తీసుకోవాలి. తదుపరి జరగబోయే నియామకాల్లో ఈ నిబంధనలు అమలు చేయాలని కమిషనర్ మార్గదర్శకాల్లో స్పష్టంగా ఉంది. అయితే, రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేనివిధంగా ఇక్కడ మాత్రం ప్రస్తుతం పని చేస్తున్న వారికి ఈ నిబంధనలు అమలు చేశారు.

- విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత వేసవిసెలవుల్లో రిలీవ్ చేయాల్సి ఉంది. కానీ విద్యా సంవత్సరం మధ్యలో (జూలై) రిలీవ్ చేశారు.
- టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను డిప్యుటేషన్ తీసుకునే సమయంలో తప్పనిసరిగా ముందుగా కమిషనర్‌తో అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే, కమిషనర్ అనుమతులు లేకుండా, ఆయన దృష్టికి కూడా తీసుకెళ్లకుండా ఇటీవల సమగ్ర శిక్ష కార్యాలయానికి ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై వేశారు.
- సెక్టోరియల్ అధికారులుగా తీసుకునేవారికి సంబంధించిన ప్రపోజల్స్ వేసవి సెలవుల్లో కమిషనర్ కార్యాలయానికి పంపాల్సి ఉంది. కానీ మధ్యలోనే ఇంటర్వ్యూలు నిర్వహించి కలెక్టర్‌కు ప్రపోజల్స్ పంపారు.
- కంప్యూటర్ పరిజ్ఞానంపై ఉన్న సామర్థ్యాలపై ఇంటర్వ్యూ సమయంలో పరీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం కంప్యూటర్ ఆన్, ఆఫ్ చేసేదైనా వస్తుందా? అని ఏ ఒక్కరినీ అడగలేదు.
- డీఈఓ కార్యాలయంలోని ఏపీఓ పోస్టుకు ఎస్జీటీ అర్హులు. కానీ, స్కూల్ అసిస్టెంట్ ఏపీఓగా పని చేస్తున్నారు. పైగా అతనికి మూడేళ్ల సర్వీస్ పూర్తయింది. కొనసాగించాలంటే ప్రభుత్వం జీఓ విడుదల చేయాల్సి ఉంది. కానీ ఇప్పటిదాకా ప్రపోజల్స్ కూడా పంపలేదు. తాను పని చేస్తున్న కార్యాలయంలోనే డీఈఓ ఈ విధంగా వ్యవహరించడం పట్ల ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా.. 10 మందికి గాయాలు



బోల్తా పడిన ప్రైవేట్ బస్సు

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బోల్తా పడి పది మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 60 మంది ప్రయాణికులతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో హంపాపురం సమీపంలో బోల్తా పడింది. ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 ద్వారా అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వారంలో రెండు రోజులు మెడికల్ సర్టిఫికెట్ల జారీ

అనంతపురం మెడికల్: వారంలో రెండు రోజులు మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ నెల 22 తర్వాత ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా, బోదకాలు, పక్షవాతం, ప్రమాదంలో వీల్‌చైర్‌కు పరిమితమైన వారు, డయాలసిస్, కిడ్నీ తొలగించుకున్న వారు ఆయా రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సంప్రదించాలన్నారు.

ఆశలు 'భద్ర'ం

- మళ్లీ నిండిన తుంగభద్ర జలాశయం
- హెచ్చెల్సీకి కోటా పెరిగే అవకాశం
- నాలుగు గేట్లు ఎత్తిన టీబీ బోర్డు అధికారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



టీబీ డ్యాం

అనంతపురం సెంట్రల్: తుంగభద్రమ్మ మళ్లీ కరుణించింది. భారీగా వస్తున్న వరద నీటితో నిండుకుండను తలపిస్తోంది. రెండు రోజులుగా కర్ణాటకలోని నదీ పరివాహక ప్రాంతాల్లో మంచి వర్షాలు కురుస్తుండటంతో జలాశయంలోకి 24,465 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద మరింత పెరిగే అవకాశం ఉండడంతో మంగళవారం నుంచి నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో కోటా కంటే ఎక్కువగా నీరు వచ్చే అవకాశముండటంతో హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంటలకు ఢోకా లేనట్లే..

ఉమ్మడి అనంతపురం జిల్లాకు టీబీ డ్యాం వరప్రదాయినిగా నిలుస్తోంది. ఈ ఏడాది డ్యాంలో 172 టీఎంసీల నీటి లభ్యత కాగా దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.368 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటి వరకూ 13.828 టీఎంసీల నీటిని విడుదల చేయగా సరిహద్దులోకి 12.172 టీఎంసీలు వచ్చాయి. ప్రస్తుతం హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు కోటి ఆశలతో పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా సరిహద్దులో 1,848 కూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. అయితే కొన్ని రోజుల క్రితం కర్ణాటకలో వర్షాలు తగ్గిపోవడంతో డ్యాం మళ్లీ నిండుతుందా? హెచ్చెల్సీకి అనుకున్న స్థాయిలో నీటిని వదులుతారా? అనే సందేహం ఉండేది. ఈ నేపథ్యంలోనే జలాశయం నిండుకుండలా మారటంతో పంటలకు ఇక ఢోకా ఉండదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ ఏడాది మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీ (సాగునీటి సలహా మండలి) సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే హెచ్ఎల్ఎంసీ, జీబీసీ, మిడ్ పెన్నార్‌సౌత్ కెనాల్స్‌కు నీటిని విడుదల చేశారు. త్వరలో ఎంపీ నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ తదితర కాలువలకు నీరు విడుదల చేయనున్నారు. దీంతో ఆయకట్టు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

230 టీఎంసీలు సముద్రం పాలు!

తుంగభద్ర జలాశయం సామర్థ్యం 105 టీఎంసీలు కాగా ప్రస్తుతం 101.500 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఈ ఏడాది జలాశయానికి గణనీయమైన వరద వచ్చింది. ఆ క్రమంలోనే జలాశయం 19వ గేటు కొట్టుకుపోయింది. దాదాపు పదిరోజుల పాటు శ్రమించి గేటును పునరుద్ధరించారు. తర్వాత వచ్చిన వర్షానికి జలాశయం పూర్తిగా నిండింది. మళ్లీ ఇప్పుడు కురుస్తున్న వానలతో ఇన్‌ఫ్లో పెరగడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 230 టీఎంసీల నీరు సముద్రం పాలైనట్లు అధికారులు చెబుతున్నారు.

నీటి కోటా పెరగవచ్చు..

తుంగభద్ర జలాశయానికి ఆశించిన స్థాయి కన్నా ఎక్కువగా వరద వస్తోంది. ప్రస్తుత డ్యాం నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. 26.368 టీఎంసీలు హెచ్చెల్సీకి కేటాయించారు. వర్షాలు కొనసాగితే కేటాయింపులు మారిపోతాయి. నవంబర్‌లో జరిగే సమావేశంలో అదనపు జలాలపై స్పష్టత వస్తుంది. జిల్లాలో ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– ఎస్. రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

ఊరించి..ఉసూరుమనిపించి



అనంతపురంలోని బళ్లారిబైపాస్‌లో అన్నా క్యాంటీన్ ఎదురుగా ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద రద్దీ

- కానరాని కొత్త బ్రాండ్‌లు
- రూ. 99కే చీప్ లిక్కర్ ఉత్తిదే
- 'కూటమి సర్కారు'పై మందుబాబుల మండిపాటు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కొత్త మద్యం పాలసీతో నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందిస్తామంటూ ఊరించిన చంద్రబాబు ఆదిలోనే మందుబాబులను ఉసూరుమనిపించారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం పలు చోట్ల కొత్త మద్యం షాపులను ప్రారంభించారు. ధరలు తగ్గించి, నాణ్యమైన మద్యం ఇస్తామని సీఎం చంద్రబాబు పదే పదే చెప్పడంతో ఒక్కసారిగా మందుబాబులు షాపుల వద్దకు ఎగబడ్డారు. ఉదయం 10 గంటలకే అనంతపురంలోని బళ్లారి బైపాస్‌లో ఏర్పాటైన మద్యం షాపు వద్ద క్యూ కట్టారు. తీరా షాపులో బ్రాండ్లను చూసి నిరాశతో వెనుదిరిగారు. కొత్త బ్రాండ్లు ఎక్కడా లేవని, అన్నీ పాతవే ఉన్నాయని వాపోయారు. పైగా సామాన్యులకు రూ.99కే చీప్ లిక్కర్ ఇస్తానని చెప్పిన చంద్రబాబు అది కూడా అందుబాటులోకి తీసుకురాకపోవడంతో మందుబాబులు తీవ్రంగా మండిపడ్డారు. కొందరు సీఎంపై బహిరంగంగానే తిట్ల దండకం అందుకున్నారు. ధరలు ఎక్కడ తగ్గించావ్, నాణ్యమైన మద్యం అంటే ఇదేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి నిలబడినా చివరకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నా క్యాంటీన్ వద్ద లిక్కర్ షాపు..

అనంతపురం నగరంలో అన్నా క్యాంటీన్ పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేయడంపై నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి బైపాస్ రోడ్డులో నిత్యం జనసంచారం అధికంగా ఉంటుంది. ఇటీవల అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో రద్దీ మరింత పెరిగింది. అలాంటి చోట మద్యం షాపు ఏర్పాటు చేయడంపై పలువురు మండిపడుతున్నారు. కాగా, మద్యం ధరలపై ఇప్పటికీ పలువురికి అనుమానాలున్నట్లు తెలుస్తోంది. గతంలో కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

రూ.15.55 కోట్ల మద్యం సరఫరా

కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రి వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని 223 దుకాణాలకు రూ.15.55 కోట్ల విలువైన మద్యం సరఫరా చేసినట్లు అనంతపురం లిక్కర్ గోడౌన్ అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ ఐఎంఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) 16,800 కేస్‌లు, బీర్లు 6,008 కేస్‌లు కలిపి మొత్తం 22,808 కేస్‌ల మద్యం ఆయా షాపులకు లిక్కర్ గోడౌన్ నుంచి వెళ్లింది.

జిల్లా అంతటా వాన



బొమ్మనహాళ్ సమీపంలో మిరప పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

- పలు చోట్ల నీట మునిగిన పంటలు
- అన్నదాతలకు తీరని నష్టం



అనంతపురంలో వానలో జనం అవస్థలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా వాన కురిసింది. ఎక్కడా భారీ వర్షపాతం నమోదు కాలేదు. మంగళవారం అర్ధరాత్రి మొదలైన జడి బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. డీ.హీరేహాళ్, గుత్తి, అనంతపురం మండలాల పరిధిలో 20 మి.మీ మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు, కంబదూరు, కళ్యాణదుర్గంలో 17 మి.మీ, విడపనకల్లు, గార్లదిన్నె, యాడికి, వజ్రకరూరులో 15 మి.మీ, పెద్దవడుగూరు, గుంతకల్లు, నార్పల, యల్లనూరు, రాప్తాడు, పామిడి, ఉరవకొండ, బుక్కరాయసముద్రం, బ్రహ్మసముద్రం, తాడిపత్రి మండలాల్లో 10 మి.మీ పైబడి వర్షపాతం నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. అక్టోబర్ సాధారణం 100.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 65 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఖరీఫ్ పంటలకు నష్టం..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పంటలకు నష్టం చేకూరింది. తొలగించిన వేరుశనగ పంట చాలా ప్రాంతాల్లో తడిసిపోయింది. వర్షాలకు కప్పిపెట్టినా బూజు, మొలకలు వస్తే నష్టమంటున్నారు. ఆముదం, పత్తి కోతలు చేసిన ప్రాంతాల్లో కూడా నష్టం వాటిల్లే పరిస్థితి. మేఘాలు కమ్ముకోవడం, జడి కారణంగా కంది కూడా పూత రాలిపోతోంది. దీంతో పంట ఉత్పత్తులే కాకుండా గ్రాసం కూడా దెబ్బతిని రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మంచి ధరలు పలుకుతున్న తరుణంలో వర్షాల కారణంగా టమాట రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే రబీ కింద పప్పుశనగ, ఇతర పంటల సాగుకు ఈ వర్షాలు అనుకూలమని అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముంచేందుకే రీచ్ ఏర్పాటు చేస్తున్నారా?



జేసీతో మాట్లాడుతున్న చిలమకూరువాసులు

యల్లనూరు: మమ్మల్ని ముంచేందుకే ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తున్నారా? అంటూ మండలంలోని చిలమకూరు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ చిలమకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని జేసీకి విన్నవించారు.గతంలో చిత్రావతి నదికి భారీగా వరద వచ్చినప్పుడు తమ గ్రామంలోకి నీరు చేరాయని,దీంతో గ్రామస్తులంతా కొండగుట్టలపైకి వెళ్లామన్నారు. చట్ట ప్రకారం ఇసుక తవ్వకాలు జరిపే ముందు ఆ ప్రాంతంలో గ్రామసభలను నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు. భవిష్యత్తులో మరో మారు వరద వస్తే తమ పరిస్థితి ఏంటంటూ వాపోయారు. జేసీ శివనారాయణ శర్మ మాట్లాడుతూ గ్రామస్తుల అభిప్రాయాలను కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానన్నారు. పలువురు అధికారులు ఉన్నారు.

మద్యం షాపు వద్దే వద్దు

- వర్షంలోనూ ఆందోళన కొనసాగించిన మహిళలు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

అనంతపురం: ఆ ప్రాంతంలో ఆస్పత్రులున్నాయి. కళాశాలలకు ఆ వైపు నుంచే విద్యార్థినులు వెళ్తుంటారు. మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జనసంచారం అధికంగా ఉంటుంది. అలాంటి చోట మద్యం షాపు ఏర్పాటు చేయాలని చూడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురం నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతంలో నివసించే మహిళలంతా ఒకరి తర్వాత ఒకరు వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. వాన పడుతున్నా ఎక్కడా తగ్గకుండా నిరసన తెలిపి మద్యం షాపు వద్దే వద్దంటూ ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రధాన కూడలిలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే ఎలా అని నిలదీశారు. షాపును మరో చోటకు మార్పు చేసుకోవాలని కోరారు. పోలీసులు వచ్చి సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా.. షాపును మార్పు చేస్తే తప్ప ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు కూడా అక్కడి నుంచి వెనుదిరగాల్సి వచ్చింది.

క్లుప్తంగా

వర్షాలున్నాయ్.. వేరుశనగ పంట తొలగించొద్దు



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: ప్రస్తుతం వర్షాలు పెద్ద ఎత్తున కురుస్తున్న నేపథ్యంలో కోత దశలో ఉన్న వేరుశనగ పంటను తొలగించరాదని రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. ఆత్మకూరు మండలం పి.యాలేరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఇప్పటికే పంటను తొలగించిన రైతులు ఎత్తైన ప్రదేశాల్లో టార్పలిన్ చుట్టి ఉంచాలన్నారు. వర్షం కురిసే సమయంలో పురుగు మందులను, ఎరువులను పిచికారీ చేయరాదన్నారు. వర్షపు నీరు ఎక్కువగా పొలాల్లో నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వరి, కంది పంటలకు సంభందించిన వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుచరిత, రైతులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం మెడికల్: ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. కో ఆపరేటివ్ సొసైటీ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి కె.చాముండేశ్వరి, సి.పద్మజ, ఆర్‌బీ పద్మావతి, ఉపాధ్యక్ష పదవికి వి.సుజాత, సి.మహాలక్ష్మి, బి.భానులత, ఎ.జలజాక్షి, కార్యదర్శి పదవికి జి.సుజాత, పి.లత, పి.లక్ష్మి, కోశాధికారికి ఎ.సంధ్య అరుణ, ఎం.నాగమణి, జి.దీప, ఎం.వినోలియా విమలతో పాటు ఈసీ సభ్యులుగా ఏడుగురు నామినేషన్ దాఖలు చేశారు. కాగా, గురువారం నామినేషన్ల ఉపసంహరణ, 18న జాబితా ప్రచురణ ఉంటుంది. ఈ నెల 23న ఐఎంఏ హాల్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో మొత్తం 246 మంది స్టాఫ్ నర్సులు తమ ఓటును వినియోగించుకోనున్నారు.

జిల్లాకు 1,340 మెట్రిక్ టన్నుల డీఏపీ

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు అన్ని రకాల కంపెనీల ఎరువులు జిల్లాకు సరఫరా అవుతున్నట్లు రేక్ ఆఫీసర్ ఎం.రవి తెలిపారు. బుధవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. క్రిబ్‌కో కంపెనీ నుంచి 1,340 మెట్రిక్ టన్నుల డీఏపీ వచ్చిందన్నారు. ఇందులో 50 శాతం ఏపీ మార్క్‌ఫెడ్‌కు కేటాయించగా... మిగతావి కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. జేడీఏ ఆదేశాల మేరకు ఎరువుల కొరత ఏర్పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామన్నారు. ఎక్కడైనా కృత్రిమంగా డిమాండ్ సృష్టించినా, ఎంఆర్‌పీకి మించి అధిక ధరకు విక్రయాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేసెయ్ పాగా

- 8 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసిన టీడీపీ నాయకులు
- అనంతపురం రూరల్ మండలం కురుగుంట పొలం 83-1 సర్వే నంబర్ వంక పొరంబోకులో వెలిసిన గుడిసెలు
- ఒక్కో గుడిసెకు ధర ఫిక్స్ చేసి అక్రమ వసూళ్లకు రంగం సిద్ధం
- రెన్నెళ్లవుతున్నా అటువైపు కన్నెత్తిచూడని రెవెన్యూ అధికారులు
- ముఖ్య ప్రజాప్రతినిధి అండతో రెచ్చిపోతున్న చోటా నాయకులు



సజ్జలకాలువ వద్ద వంక పొరంబోకు స్థలాన్ని ఆక్రమించి వేసిన గుడిసెలు

రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామాల్లో టీడీపీ చోటా నాయకులు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా భూముల ధరలకు రెక్కలొచ్చిన అనంతపురం రూరల్ మండలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్పనంగా దోచేసేందుకు ఆత్రుత పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఎటు చూసినా సెంటు ధర రూ.లక్షల్లో పలుకుతోంది. ఓ వైపు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టి అక్రమంగా లేఔట్లు వేస్తుండగా, మరోవైపు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు తెర లేపారు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి పేరు చెబుతూ దందాలకు శ్రీకారం చుట్టారు. తాజాగా పేదల మాటున అనంతపురం రూరల్ మండలం కురుగుంట రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 83-1లో (సజ్జలకాలువ సమీపంలో) దాదాపు 8 ఎకరాల వంక పొరంబోకు భూమికి ఎసరు పెట్టారు. ఇందులో భాగంగా ఆ ప్రాంతాన్ని ఆక్రమించి గుడిసెలు వేశారు.

ఓ సంఘం నేతను అడ్డుపెట్టుకుని...

కురుగుంట పంచాయతీకి చెందిన టీడీపీ చోటా నాయకులు ఓ సంఘం నాయకుడిని అడ్డుపెట్టుకుని సజ్జలకాలువ సమీపంలోని వంక పొరంబోకు భూమిలో రెన్నెళ్ల క్రితం గుడిసెలు వేశారు. సమీప ప్రాంతాల్లో ఉంటున్న వారే ఇందులో ఎక్కువగా ఉన్నారు. ఓ గ్రామ రెవెన్యూ అధికారి కూడా వీరికి పూర్తిగా సహకరిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఒక్కో గుడిసెకు ధర ఫిక్స్ చేసి వసూళ్లకు తెర తీసినట్లు సమాచారం. రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తెప్పించుకుని మొత్తం 8 ఎకరాల స్థలానికి పట్టాలిప్పించుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ సంఘం నాయకులు గతంలోనూ ఇలాగే గుడిసెలు వేయించి పెద్ద ఎత్తున వ్యాపారం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

నోరు మెదపని రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేసిన విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే ఇందుకు కారణంగా తెలిసింది. దీంతో ఈ మొత్తం వ్యవహారం రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ గుడిసెలను తొలగిస్తాం

కురుగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 83-1లోని ప్రభుత్వ స్థలంలో కొందరు గుడిసెలు వేసుకున్నట్లుగా తెలిసింది. ఇలాంటివి ఉపేక్షించేదేలేదు. పేదలు జాగ్రత్తగా ఉండాలి. వంక పొరంబోకుతో పాటు, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే కచ్చితంగా తొలగిస్తాం. ప్రొటెక్షన్ కోసం ఇప్పటికే ఎస్పీకి లేఖ రాశాం. వారి నుంచి అనుమతులు రాగానే ఆ గుడిసెలన్నీ తొలిగిస్తాం. కురుగుంట, ఉప్పరపల్లి, సోములదొడ్డి పంచాయతీల్లోనూ వివిధ ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం

సర్టిఫికెట్ల ధ్రువీకరణలో జాప్యం

అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణలో పరీక్షల విభాగం అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. బీటెక్ పూర్తి చేసి కంపెనీల్లో ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లు ఒరిజినలా? కాదా? అని ధ్రువీకరించేందుకు ఆయా కంపెనీలు థర్డ్‌పార్టీ వెరిఫికేషన్‌కు పంపుతారు. ఈ క్రమంలో థర్డ్‌పార్టీ తరపున అందిన సర్టిఫికెట్ల ధ్రువీకరణలో జాప్యం నెలకొంటోంది. దీంతో దక్కిన ఉద్యోగాలను విద్యార్థులు కోల్పోవాల్సి వస్తోంది. వర్సిటీలో చదివినట్లు ధ్రువీకరించడంతో పాటు పాస్ అయినట్లు వర్సిటీ అధికారికంగా ఇచ్చిన సమాచారం ఆధారంగానే తొలుత కంపెనీలు ఉద్యోగంలో చేర్చుకుంటాయి. వెరిఫికేషన్‌లో ఆలస్యం జరిగి ఉద్యోగాలు కోల్పోవడం ద్వారా తాము చేయని తప్పునకు విద్యార్థులు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. జేఎన్‌టీయూఏ పరీక్షల విభాగంలో పరీక్షల విభాగం డైరెక్టర్‌తో పాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ముగ్గురు అడిషనల్ కంట్రోలర్లు ఉన్నారు. వాస్తవానికి ఒక అడిషనల్ కంట్రోలర్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. థర్డ్‌పార్టీ వెరిఫికేషన్ మాకు వద్దు.. అంటే మాకు వద్దు అని అడిషనల్ కంట్రోలర్లు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ నిర్లక్ష్యం చేస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఆలస్యం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యోగాలకు ఎంపికైన తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ఈ అంశంపై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడిషనల్ కంట్రోలర్‌కు ఈ బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు.

పర్యావరణ సుస్థిరతతోనే మానవాళి మనుగడ

- అంతర్జాతీయ సదస్సులో వక్తలు



అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న జేఎన్ టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: పర్యావరణ సుస్థిరతతోనే మానవాళి మనుగడ సాధ్యమని జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సుదర్శనరావు.హెచ్ అన్నారు. 'మెంబరెన్స్ ప్రాసెస్ ఫర్ ఏ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్' అంశంపై జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును ఇన్‌చార్జ్ వీసీ ప్రారంభించి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో మెంబరిన్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణంలో మార్పులను అరికట్టాలంటే మెంబరిన్ టెక్నాలజీ అనివార్యమన్నారు. మేధో వికాసానికి ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు దోహదపడతాయన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన సదస్సును జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో నిర్వహించడం గర్వకారణమన్నారు. కాగా, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ వ్యవహరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. 17 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొనగా... కొందరు వర్చువల్ విధానంలో ప్రసంగించారు. పోలాండ్‌లోని టోరన్ నగరంలో ఉన్న మెంబ్రెన్, మెబ్రెన్ టెక్నిక్స్ రీసెర్చ్ గ్రూపు నైకోలస్ కొపరినెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఓజిచ్ కుజైవిస్కి, హైదరాబాద్‌లోని మెంబర్ ల్యాబ్ సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీధర్, తిరుపతి ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ కేఎస్ఎంఎస్ రాఘవరావు, ఐఎంఎస్ చైర్మన్ ప్రొఫెసర్ సీఎస్ మూర్తి, గుజరాత్‌లోని వడోదరలో ఉన్న పర్మోనిక్స్ మెంబరాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి సత్యజేయ మేయర్, ముంబయి ఐఐటీ ప్రొఫెసర్ సత్యప్రతాప్ సింగ్, ఐఎన్‌డీ చైర్మన్ ప్రొఫెసర్ వీకే శ్రీవాస్తవ, తిరుచారాపల్లిలోని ఎన్ఐటీ ప్రొఫెసర్ జి.అర్ధనారీశ్వరన్, ఖరగ్‌పూర్ ఐఐటీకి చెందిన డాక్టర్ షిర్వేందు దీ, న్యూయార్క్‌లోని కెమ్ ఫినిటీ టెక్నాలజీ డాక్టర్ రవీంద్ర రెవనార్, కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఉష.కె.అరవింద్, చెన్నైలోని అన్నా యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.బాలసుబ్రమణియన్ ముఖ్య వక్తలుగా ప్రసంగించారు.

చరిత్ర తిరగరాసిన 'కంది'

- ఈ ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 1.03 లక్షల హెక్టార్లలో సాగు
- గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70 వేల హెక్టార్లకు మించింది లేదు
- ఈసారి సగానికి తగ్గిన వేరుశనగ, పత్తి సాగు విస్తీర్ణం
- ఓవరాల్‌గా 92 శాతం సాగుతో 3.20 లక్షల హెక్టార్లలో 'ఖరీఫ్'



ఈ ఖరీఫ్‌లో సాగైన కంది పంట

అనంతపురం అగ్రికల్చర్: కంది పంటపై ఈ సారి రైతులు చాలా మక్కువ చూపారు. చరిత్ర తిరగరాస్తూ ఈ ఖరీఫ్‌లో ఏకంగా 1.03 లక్షల హెక్టార్లలో కంది సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 37,367 హెక్టార్లు కాగా 277 శాతం అధిక విస్తీర్ణంలో సాగులోకి రావడం విశేషం. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా ఈ స్థాయిలో కంది సాగులోకి రాలేదు. 2017లో అత్యధికంగా 71 వేల హెక్టార్లుగా నమోదైంది. ఆ తర్వాత 50 వేల నుంచి 60 వేల హెక్టార్లలో సాగవుతూ వస్తోంది. ఈ సారి లక్ష హెక్టార్లకు అధిగమించి ప్రధానపంట వేరుశనగతో పోటీ పడటం గమనార్హం. ఇలాగే రెండు మూడేళ్లు కొనసాగితే జిల్లాలో ప్రధానపంటల జాబితాలో వేరుశనగను వెనక్కినెట్టి కంది మొదటి స్థానంలో నిలవడం ఖాయమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సగానికి తగ్గిన వేరుశనగ, పత్తి

ఈ ఖరీఫ్‌లో అపుడపుడు కురిసిన మోస్తరు వర్షాలకే జిల్లా రైతులు పంటల సాగు కొనసాగించారు. ఈ క్రమంలో వేరుశనగపై రైతులు అనాసక్తి ప్రదర్శించారు. దీంతో సాధారణ సాగు విస్తీర్ణం 1.98 లక్షల హెక్టార్లు కాగా 57 శాతంతో 1.12 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగులోకి వచ్చింది. అలాగే సయమానికి వర్షాలు పడకపోవడంతో పత్తి సాగు కూడా 48,586 హెక్టార్లకు గానూ 59 శాతంతో 28,530 హెక్టార్లలో వేశారు. ఈ రెండు ప్రధాన పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గినందున వాటి స్థానంలో కంది సాగు పెరగడం విశేషం. మరో ప్రధాన పంటల జాబితాలో ఉన్న ఆముదం 97 శాతంతో 15,847 హెక్టార్లు, మొక్కజొన్న 173 శాతంతో 19,978 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ సారి అంచనాకు మించి కంది, మొక్కజొన్నతో పాటు కొర్ర కూడా 2,001 హెక్టార్లకు గానూ 449 శాతం అధికంగా 8,994 హెక్టార్లలో వేశారు. అలాగే సజ్జ కూడా 1,610 హెక్టార్లకు గానూ 202 శాతం అధికంగా 3,251 హెక్టార్లలో సాగు చేశారు. ఇక రాగి, ఉలవ, పెసర, అలసంద, మినుము, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర పంటలు నామమాత్రపు విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. నీటి వసతి కింద 22 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. ఓవరాల్‌గా తీసుకుంటే ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లు అంచనా వేయగా... చివరకు 92 శాతం విస్తీర్ణంతో 3.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. పంట దిగుబడుల విషయానికి వచ్చినా వేరుశనగ, పత్తి, ఆముదం పంట దిగుబడులు బాగా తగ్గిపోగా... ప్రస్తుతం పూత దశలో ఉన్న కంది కొంత వరకు ఆశాజనకంగా ఉన్నందున దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. వాతావరణం, వర్షాలను బట్టి కంది ఎంత వరకు రైతులను గట్టెక్కిస్తుందనేది వేచి చూడాలని చెబుతున్నారు.

కారు, లారీ ఢీ - పలువురికి గాయాలు

యాడికి: కారు, లారీ పరస్పరం ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రికి రాఘవ, సుదర్శన్‌రెడ్డి, సూర్య, శ్రీధర్ బుధవారం మధ్యాహ్నం కారు (ఏపీ39ఎన్‌టీ 4355)లో గుత్తికి బయలుదేరారు. యాడికి మండలం వేములపాడు వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అటువైపు నుంచి వస్తున్న లారీని ఢీకొన్నారు. ఘటనలో కారు నడుపుతున్న శ్రీధర్, రాఘవకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడు చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న శ్రీధర్‌ను ఓ వాహనంలో కర్నూలుకు తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డీఎల్‌డీఏ ఈఓకు గడువు పొడిగింపు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ–డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా పనిచేస్తున్న పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) డాక్టర్ టి.సుధాకర్ పదవీ కాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టరేట్ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2025, జూలై 14వ తేదీ వరకు ఆయన ఈఓగా కొనసాగనున్నారు.

విత్తన పప్పుశనగ పంపిణీలో అక్రమాలు

- ప్రభుత్వం ప్రకటించినట్లు 40 కిలోలు ఇవ్వాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్

అనంతపురం అర్బన్: జిల్లాలో విత్తన పప్పుశనగ పంపిణీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, కొన్ని గ్రామాల్లో రైతులకు 20 కిలోలే అందజేస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎకరాకు 40 కిలోల విత్తన పప్పుశనగను ఇవ్వాల్సిందేనన్నారు. బుధవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తోందని మండిపడ్డారు. 2023 రబీలో ప్రకృతి వైపరీత్యాలతో పూర్తిగా పంటలు నష్టపోయి కనీసం పెట్టుబడులు కూడా చేతికి అందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం, బీమా సొమ్ము ప్రకటించకుండా కూటమి సర్కార్ అన్యాయం చేస్తోందన్నారు. ప్రస్తుత రబీలో 25 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగను ఇవ్వడం ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.7 వేల నుంచి రూ.7,300 వరకు ఉందని, ప్రభుత్వం క్వింటాకు రూ.9,400 ధర నిర్ణయించి... 25 శాం సబ్సిడీ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 90 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ ఇవ్వాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో పురుగు మందులు, ఎరువులు ఇవ్వాలన్నారు.

11,890 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: రబీ రైతులకు రాయితీ విత్తన పప్పుశనగ పంపిణీ కొనసాగుతోందని జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 22 మండలాల పరిధిలో నల్లరేగడి భూములు కలిగిన రైతులకు బుధవారం నాటికి ఆర్ఎస్‌కే వేదికగా 11,890 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందన్నారు. విత్తనం కోసం 13,561 మంది రైతులు తమ వాటా చెల్లించి 19,059 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకు పప్పుశనగ సాగుకు అనుకూలమని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేస్తారా?

- కూటమి సర్కార్‌ను నిలదీసిన సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



సభలో మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్: నూతన మద్యం పాలసీ పేరుతో ప్రజలను మత్తులో ముంచి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసేందుకు కూటమి సర్కార్ కంకణం కట్టుకుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ధ్వజమెత్తారు. సాగునీటి సాధనకు సీపీఎం చేపట్టిన బస్సు యాత్ర బుధవారం సాయంత్రం గుంతకల్లుకు చేరుకుంది. స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం షాపులపై ఉన్న చిత్తశుద్ధి కరువు నుంచి జిల్లా రైతాంగాన్ని విముక్తి చేయడంపై లేదన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు తక్షణమే చేపట్టాలని, తుంగభద్ర డ్యామ్ గేట్లను మార్చాలని, హంద్రీనీవా కాలువ రాగులపాడు లిఫ్ట్ నుంచి గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించాలని డిమాండ్ చేశారు. జీబీసీ, జీఏ సీబీసీల్లో పూడికతీత పనులు చేపట్టి చివరి ఆయకట్టుకూ నీరందించాలన్నారు. సాగునీటి సాధన కోసం ఈ నెల 21న కలెక్టరేట్ చేపట్టిన మహాధర్నాను విజయవంతం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు బాలరంగయ్య, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, స్థానిక నాయకులు డి.శ్రీనివాసులు, నాగరాజు, మారుతి, రమేష్, రంగమ్మ, నరసయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి





మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) అంజినప్ప (ఫైల్)

ఉరవకొండ: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన కురుబ అంజినప్ప(39) తనకున్న ఎకరా పొలంలో వరి సాగు చేశాడు. బుధవారం పంటకు నీళ్లు పెట్టిన తర్వాత బోరు మోటార్ స్విచ్చాఫ్ చేస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన ఆయన సోదరుడు బొజ్జప్ప వెంటనే ఓ ఆటోలో ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అంజినప్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. 'పంట చేతికొస్తే ఉన్న అప్పులు తీర్చి ఇద్దరు ఆడపిల్లలను బాగా చదవించుకుందామంటూ పోయావ్ కదా సామీ... ఇప్పుడు మా గతేమేమి?' అంటూ మృతుని భార్య సులోచన రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యూపీ వాసి దుర్మరణం

తాడిపత్రి అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నవ్ జిల్లా రోషన్‌గంజ్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (39) రెండేళ్ల క్రితం తన భార్య, పిల్లలతో కలసి తాడిపత్రికి వలస వచ్చి నందలపాడులో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ద్విచక్ర వాహనంపై ఐస్‌క్రీమ్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై ఐస్‌క్రీమ్ బాక్స్ పెట్టుకుని వెళుతుండగా సీబీ రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

19న పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగమేళా

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసున్న అభ్యర్థులు అర్హులు. ఉద్యోగాలకు ఎంపికైనవారు హైదరాబాద్, బెంగళూరులో పనిచేయాల్సి ఉంటుంది. నెలకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు జీతం చెల్లిస్తారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే యువతీయువకులు బయోడేటాతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు వెంట తీసుకెళ్లాలి.

రెండు టిప్పర్లు, ట్రాక్టర్ పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఓ ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రభాకర్ అప్రమత్తం చేయడంతో స్థానిక జాతీయరహదారిపై లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, సిబ్బంది బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన రెండు టిప్పర్లు, ఓ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

'అనంత'లో వైభవ్ జ్యువెలర్స్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న అంజనాసిన్హా (చిత్రంలో) ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, వైభవ్ సంస్థల సీఎండీ రత్నకుమారి తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ప్రముఖ వైభవ్ జ్యువెలర్స్ సంస్థ తన 16వ బ్రాంచ్‌ను అనంతపురంలోని రాజు రోడ్డులో బుధవారం అట్టహాసంగా ప్రారంభించింది. కళ్యాణదుర్గం, అనంతపురం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అంజనా సిన్హా ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి గడించిన వైభవ్ జ్యువెలర్స్ అనంతపురంలో బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారి మాట్లాడుతూ.. వినియోగదారులకు అద్భుత శ్రేణి షాపింగ్‌తో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్‌మార్క్ కలిగిన బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, ఇన్‌స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్ తదితర ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైభవ్ హోల్‌టైమ్ డైరెక్టర్ సాయికీర్తన గ్రంధి, సీఓఓ గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, అమరేంద్ర గ్రంధి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు నమోదు



మృతురాలు సంగీత

పుట్లూరు: కర్ణాటక ప్రాంతానికి చెందిన మహిళ మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కర్ణాటకలోని బీదర్ జిల్లా దుబల్‌గుండి గ్రామానికి చెందిన వివాహిత సంగీత (21) పుట్లూరు మండలం ఎ.కొండాపురంలోని పవిత్ర హోటల్‌లో కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమె తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమెకు భర్త నాగరాజు, మూడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. ఆమె మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ శేషారెడ్డి సమక్షంలో పోలీసులు పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

వరి పంట ధ్వంసం



గడ్డిమందు పిచికారీతో దెబ్బతిన్న వరి

పామిడి: మండలంలోని కండ్లపల్లికి చెందిన మహిళారైతు నెల్లి లక్ష్మీదేవి సాగు చేసిన వరిపంటపై గుర్తుతెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారు. గత శుక్రవారం రాత్రి ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా తెలుస్తోంది. బుధవారం ఉదయానికి పొట్టదశలో ఉన్న వరి పంట దెబ్బతినింది. తనకున్న నాలుగు ఎకరాల పొలంలో వరి పంటను లక్ష్మీదేవి సాగు చేసింది. పంటచేతికొచ్చే సమయంలో దుండగులు గడ్డి మందు పిచికారీ చేశారు. ఇలా రెండోసారి చేశారని, రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయింది.

క్లుప్తంగా

'జనావాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు'


సావిత్రి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి

అనంతపురం అర్బన్: జనావాసాల మధ్య మద్యం దుకాణాలు పెట్టవద్దని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మద్యం నియంత్రించాలని ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకుండా విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించడం సరికాదన్నారు. జనావాసాల మధ్య మద్యం దుకాణాలు పెడితే రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. గుడి, బడి, ఇళ్ల సమీపంలో, మహిళలు అధికంగా వచ్చే ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దని ఎక్సైజ్ అధికారులను విజ్ఞప్తి చేస్తొన్నామన్నారు. కాదని ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: సాగు నీటి సాధన, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన చేపట్టిన బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వడ్డుపల్లి, తలుపూరు గ్రామాల్లో బస్సుయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుంగభద్ర కాలువ ఆధునికీకరణ, హంద్రీనీవా కాలువ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. చెరువులు, కుంటలు నీటి పారుదలకు అనుసంధానం చేయాలన్నారు. పీఏబీఆర్ కాలువ నుంచి కుంటలకు, కాలువలకు చెక్ డ్యామ్‌లకు, 49 చెరువులకు నీరు ఇచ్చి నింపాలని డిమాండ్ చేశారు. బస్సు యాత్రలో రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి మంజూరైన పలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత భూమి పూజ చేశారు. అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, సీనియర్ నాయకుడు ఎల్.నారాయణ చౌదరితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రూరల్‌లో 'పొలం పిలుస్తోంది'


వేరుశనగ రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రూరల్ మండలం కక్కలపల్లి, కాటికాని కాలువ ఆర్‌ఎస్‌కేల పరిధిలో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ జే.శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య తదితరులు హాజరయ్యారు. అనంతరం వేరుశనగ, కంది పొలాల్లో చీడపీడలు, తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. అలాగే మట్టి పరీక్షల ఫలితాలకు సంబంధించి హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ సమస్యలు ఉంటే ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లను సంప్రదించి వెంటనే సవరణ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా అనంతేశ్వరుల కల్యాణం

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో బుధవారం సాయంత్రం అనంతేశ్వరీ, అనంతేశ్వరుల కల్యాణం ఘనంగా జరిగింది. వేదపండితులు హర్షశర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులకు శాస్త్ర సహితంగా కాశీయాత్ర, తలంబ్రాలు, మాంగళ్యధారణ జరిగాయి. ముత్తయిదువులు భక్తిగీతాలను ఆలపిస్తూ అమ్మవారికి సారె సమర్పించారు. అంతకు ముందు స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అమ్మవారి సామూహిక కుంకుమార్చనలు చేశారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, మల్లికార్జున, ప్రసాద్ పాల్గొన్నారు.

వదలని వాన.. రైతుల ఆందోళన




లింగనపల్లిలో రోడ్డు సమీపంలో మొక్కజొన్నకు టార్పాలిన్ కప్పిన దృశ్యం, ఆత్మకూరు వద్ద వర్షాలకు తడిసిపోయిన వేరుశనగ , రాప్తాడు వద్ద ఆముదం పంటను కాపాడుకునేందుకు పట్ట కప్పిన దృశ్యం

రాప్తాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. కనీసం బయటకు వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సంవత్సరం అతివృష్టి, అనావృష్టితో అల్లాడుతున్నామని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి మండలంలో వేరుశనగ, టమట పంటలు నీటమునిగాయి. అలాగే వరి పంట కూడా దెబ్బతింది. భారీ వర్షం కురవడంతో పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. మండలంలో దాదాపుగా 2 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో మొక్కజొన్న, ఆముదం పంటలు కోతకు రావడంతో వాటిని తొలగించి రోడ్డుపై ఆరబోశారు. రెండు రోజులుగా వర్షం కురవడంతో రైతులు వాటిని పట్ట కప్పి ఉంచారు. అలాగే ఉంచితే మొక్కజొన్న దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

తుపాన్ కారణంగా మండల ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామని తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి తెలిపారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మురుగు పొంగి పొర్లకుండా ఎక్కడికక్కడ చెత్త తొలగిస్తున్నామని చెప్పారు. కాలనీలు, ఇళ్లలోకి నీరు చేరితే పంపింగ్ చేయడానికి మోటర్లతో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. తాగునీటి శుభ్రతకు చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్, సాంద్రత పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండకూడదని సూచించారు. అలాంటి వారు తమకు సమాచారం అందిస్తే పునరాస కేంద్రాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. చెట్లు పడిపోయే స్థితిలో ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. దోమల నివారణకు అన్ని గ్రామాల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నామన్నారు. ప్రజలకు సాయం చేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉన్నారని వెల్లడించారు.

తడిసిన వేరుశనగ

ఆత్మకూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలో చాలా చోట్ల తొలగించిన వేరుశనగ తడిసిపోయింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో దాదాపు పది వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. వేరుశనగ పంట అదునుకు రావడంతో చాలా మంది రైతులు పంటను తొలగించారు. వ్యవసాయ అధికారులు పొలాల్లో పర్యటించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పశుగ్రాసం కూడా దక్కడం లేదు



పశుగ్రాసం అయినా దొరుకుందనే ఆశతో మండలంలో పలు గ్రామాల్లో రైతులు వేరుశనగ పంటను తొలగించారు. అయితే తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన పంటలన్నీ తడిసిపోయాయి. రైతులకు పశుగ్రాసం కూడా దక్కే పరిస్థితి కనబడటం లేదు. చాలా గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. పంటల దిగుబడిని కాపాడుకునేందుకు పట్టలు కప్పుకునే పరిస్థితి ఏర్పడింది. మండలంలో తుపాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

– బులగొండ బీరన్న, రైతు, రాప్తాడు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

మునిరాజ సేవలు అభినందనీయం


ఏఆర్ డీఎస్పీ మునిరాజును సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్, తదితరులు

అనంతపురం సెంట్రల్: ఏఆర్ డీఎస్పీగా మునిరాజ అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. అదనపు ఎస్పీగా పదోన్నతిపై వెళ్తున్న ఆయన్ను బుధవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఏఆర్ సిబ్బంది, అధికారులను సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) రమణమూర్తి, కళ్యాణదుర్గం డీఎస్పీ రవికుమార్, సీఐ దేవానంద్, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, మధు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు త్రిలోక్‌నాథ్, జాఫర్, సూర్యకుమార్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత వేగవంతం చేయండి


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని నడిమివంక, మరువవంకలతో పాటు పెద్ద, చిన్న కాలువల్లో పూడికతీత పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం నగరంలోని ఆరవ రోడ్డు, కైలాసం రోడ్డు, సోమనాథ్ నగర్, తపోవనం బైపాస్, యువజన కాలనీ, కోవూర్‌నగర్‌కు అనుకుని ఉన్న నడిమివంకలో జరుగుతున్న పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను వెంటనే చేపట్టాలన్నారు. ఎక్కడ కూడా నీరు నిలబడకుండా ఉండేలా చూడాలని సూచించారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శ్రద్ధగా పని చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధించడం, వేస్ట్ సెగ్రిగేషన్, వేస్ట్ డిస్పోసల్ చేయాలన్నారు. అనంతరం స్థానిక ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కైలాసం రోడ్డు ఉన్న నడిమివంకలో తాగునీటి పైప్‌లైన్ మార్చాలని పలువురు కోరారు. వేలడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయించాలన్నారు. ప్రజలందరూ కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ వేయకూడదని కలెక్టర్ సూచించారు. రానున్న రోజుల్లో ప్లాస్టిక్ వాడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఆర్‌డీఓ వసంత బాబు, తహసీల్దార్ హరికుమార్, నగరపాలక సంస్థ ఎస్‌ఈ భాస్కర రావు, ఈఈలు షాకీర్ హుస్సేన్, రాధాకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

మొదటి రోడ్డులోని శ్రీపొట్టి శ్రీరాములు స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం


సీపీఆర్ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం: విధుల్లో ఉన్నప్పుడు పోలీసు సిబ్బందికే కాకుండా ప్రజలకు సైతం ఒక్కోసారి గుండెపోటు వచ్చి గుండె, ఊపిరితిత్తులు పనిచేయకుండా ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి సమయాల్లో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసుస్సియేషన్) పద్ధతి ద్వారా మళ్లీ ఈ అవయవాలు పని చేసేలా డెమో నిర్వహించారు. గుండెపోటు వచ్చిందని గుర్తించిన వెంటనే సదరు వ్యక్తిపై ఛాతిపై రెండు చేతులు ఉపయోగించి ప్రాణాలు ఎలా కాపాడవచ్చో అవగాహన కల్పించారు. జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్లు సుబ్రహ్మణ్యం, డాక్టర్ భూషణ్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొని పోలీసులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నగరంలో ముందస్తు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ సిబ్బందిని మేయర్ వసీం ఆదేశించారు. బుధవారం వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందిని అప్రమత్తం చేశారు. పూడికతీత పనులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. ఇప్పటికే నగరంలో ఒక డెంగీ కేసు నమోదైందని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా మారుతీనగర్‌లో యాంటీ లార్వా పద్ధతులు తీసుకునేలా సిబ్బందిని సూచించడం జరిగిందన్నారు. ప్రజలు సైతం స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజుల తరబడి నీటిని నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. దోమకాటు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలని తెలిపారు. అనంతరం నడిమివంక, మరువవంక వద్ద జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, డీఈలు చంద్రశేఖర్, దాక్షాయణి, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, వైఎస్సార్ సీపీ నాయకులు రవీంద్ర రెడ్డి, రామచంద్ర, కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు.

అనస్తీషియా వైద్యుల పాత్ర కీలకం


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అనస్తీషియా విభాగం వైద్యులు

అనంతపురం మెడికల్: రోగుల ప్రాణాలు కాపాడటంలో అనస్తీషియా వైద్యులది కీలకపాత్ర. గత కొన్నేళ్లుగా ఆస్పత్రిలో జరిగిన వేల సర్జరీల విజయవంతంలో అనస్తీషియా వైద్యుల భాగస్వామ్యం ఉంది. ఇదే స్ఫూర్తితో రోగులకు నాణ్యమైన సేవలందిద్దామని ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కుమార్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా విభాగంలో ఈథర్ మత్తు మందును కనుగొన్న శాస్త్రవేత్త మోర్టన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో 1846లో శాస్త్రవేత్త మోర్టన్ మత్తు మందును కనుగొన్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. శస్త్రచికిత్స సమయంలో మత్తు మందు ఇవ్వడమే కాకుండా రోగులకు ఆపద సమయంలో, దీర్ఘకాలిక నొప్పులు, తదితర సమస్యలకు అనస్తీషియా ద్వారా ఉత్తమ సేవలందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో అనస్తీషియా వైద్యులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ జగదీష్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పద్మాబాయి, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు


ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: వర్షపు నీటితో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఎంపీడీఓ లక్ష్మీ నరసింహ స్వామి తెలిపారు. బుధవారం తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తదితరులు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ఆర్డీటీ క్రీడా మైదానం ముందు రోడ్డు, పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. ఎస్సీ కాలనీలోకి నీరు రాకుండా వంకలో జేసీబీతో పూడిక, చెత్త తీయిస్తామని తెలిపారు. వర్షపు నీటిని తొలగించేందుకు మిషన్లను కూడా అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఆర్డీటీ క్రీడా మైదానం ఎదురుగా రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు చంద్రశేఖర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ


అన్నదానం చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లోని మహబూబ్ సుబహానీ దర్గాలో బుధవారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయా మతాలకు సంబంధించిన ముఖ్యమైన పర్వదినాలు జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. పోలీసు కుటుంబాలే కాకుండా నగర ప్రజలు అందరూ సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ మునిరాజ, డీఎస్పీలు వి. శ్రీనివాసరావు, రవికుమార్, మహబూబ్ బాషా, సీఐలు క్రాంతి కుమార్, శ్రీకాంత్, శాంతిలాల్, రామకృష్ణా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఇస్మాయిల్, దేవానంద్, ఆర్‌ఐలు రెడ్డప్ప రెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

కనగానపల్లి: మండలంలోని యలకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ (54) బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనారాయణ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అతడిని అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. అయితే ఆరోగ్యం కొద్దిగా కుదుటపడిన అనంతరం మళ్లీ పరిస్థితి విషమించడంతో రెండు రోజుల క్రితం ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడక చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మారుతీనగర్‌లో డెంగీ కేసు


డెంగీ బాధితుడికి ధైర్యం చెబుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని మారుతీనగర్‌లో ఓ 43 ఏళ్ల వ్యక్తి డెంగీ బారిన పడ్డాడు. విషయం తెలుసుకున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ బాధితుడి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. అధైర్య పడాల్సిన పనిలేదని.. జ్వరం తీవ్రతను బట్టి సర్వజనాస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆ ప్రాంతాల్లో యాంటీ లార్వా పద్ధతుల్లో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించారు. అదనపు కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: ఇటీవల ఎస్జీఎఫ్ (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–14 విభాగంలో రిత్విక్ సాయి చరణ్ రెడ్డి. టి.రితిక, (10 మీటర్స్), అండర్–17 విభాగంలో బి.కౌశిక్ సాయి చరణ్ రెడ్డి, ప్రజ్ఞ, అండర్–19 విభాగంలో శ్రీజా రెడ్డి సత్తా చాటారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అనంతరాముడు విద్యార్థులను అభినందించారు.

గ్రామాల్లో 'పల్లె పండుగ'


మామిడి మొక్కలు నాటుతున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల, వేపచెర్ల దిగువ తండా, గొరిదిండ్ల , ముట్టాల గ్రామ పంచాయితీల్లో బుధవారం అధికారులు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పొలాల్లో హార్టికల్చర్ కింద మామిడి మొక్కలు నాటారు. అనంతరం గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీ నరసింహ స్వామి, ఏపీఓ సుజాత, పంచాయతీ రాజ్ ఏఈ పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

చల్లగా చూడు గౌరమ్మ తల్లీ..


ఎం.బండమీదపల్లిలో గౌరమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువతులు

రాప్తాడు: తెలంగాణలో బతుకమ్మ పండుగను మహిళలు ఎంత ఘనంగా జరుపుకుంటారో ఇక్కడ మన జిల్లాలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా గౌరమ్మ పండుగను మహిళలు, యువతులు, చిన్నారులు అంతే వైభవంగా జరుపుకుంటారు. మండలంలోని భోగినేపల్లి, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో గత మూడు రోజులుగా గౌరమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను కొలువుదీర్చి పట్టుచీర, గాజులు, పూలతో అలంకరించారు. గౌరమ్మా.. మా ఇంటి మహాలక్ష్మి నీవమ్మా' అంటూ ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం ఆయా గ్రామాల్లో గౌరమ్మ దేవిని ప్రతిష్ఠించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గౌరి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం సాయంత్రం వరకూ అమ్మవారికి పూజల అనంతరం జ్యోతులతో మహిళలు ఆలయానికి వెళ్లారు. గౌరమ్మను గ్రామ చెరువులోకి తీసుకెళ్లి వైభవంగా నిమజ్జనం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

కనగానపల్లి: తుపాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా 40 మి.మీ. దాకా వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని పలుచోట్ల వరి, వేరుశనగ, కాయగూరలు పంటలు దెబ్బతిన్నట్లు పలువురు రైతులు తెలిపారు. ఇక మండలంలోని తూంచర్ల గ్రామంలో కొండచరియల కింద నివాసం ఉన్న పలు కుటుంబాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించి పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రమాదేవి స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. భోజన వసతి కల్పించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని చెరువు, వంకలు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా తహసీల్దార్ తెలిపారు. ఇక వర్షాలు తగ్గే వరకు పంట కోతలు కోయవద్దని ఏఓ క్రిష్ణకుమారి రైతులకు సూచించారు.